నేడు కరెంట్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు(మూడో శనివారం) నగరంలోని పలు ఏరియాల్లో కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్టు టౌన్ 1,2,3 ఏడీఈలు చంద్రశేఖర్, రాజశేఖర్, వీరేశం శుక్రవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. నగరంలోని పవర్‌హౌస్, తిలక్‌గార్డెన్, దుబ్బ, వినాయక్‌నగర్, మిర్చికంపౌండ్, ముబారక్‌నగర్, న్యూ కలెక్టరేట్, సుభాశ్‌నగర్, అర్సపల్లి, మిర్చికంపౌండ్ ముబారక్‌నగర్, గూపన్‌పల్లి, న్యూ హౌసింగ్‌బోర్డు తదితర ఉప కేంద్రాల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు తెలిపారు. బోర్గాంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో సైతం మరమ్మతు పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గత మూడు నెలలుగా మరమ్మతు పనులు చేపట్టలేదని, అందుకే మూడవ శనివారం చేపడుతున్నట్టు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం | మే 18, 2024 | www.navatelangana.com

విఠల్వాడీ పాఠశాలను బాగు చేయిస్తాం : కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి డెస్క్

పెద్దకొడప్‌గల్ మండలంలోని విఠల్వాడీ పాఠశాలను జూన్ నెలలోగా బాగు చేయిస్తామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండలంలోని విఠల్వాడీ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. పాఠశాల పై కప్పు బాగాలేక వర్షపునీరు వస్తుందని స్థానికులు తెలపగా, జూన్ విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేలోగా పాఠశాల పైకప్పు తొలగిం చి రేకులు వేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో పాటుగానే పాఠశాలలో తాగునీరు, పాఠశాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని అదికారులకు సూచించారు. రానున్న రోజుల్లో ఈ గ్రామంలో నూతన పాఠశాల నిర్మాణానికి నిధులు ఇస్తానని, వాటితో పాఠశాల ఆవరణలోపురాతన గదులను కూల్చివేస్ నూతనంగా నిర్మిస్తామని తెలిపారు.దీంతో పాటుగానే మండలంలో పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగు పర్చాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జి విద్యాధికారి దేవిసింగ్, ఏఈ చందూ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగమణి తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో ఆగమవుతున్న రైతన్న



రైస్‌మిల్లుకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు.. లారీలు లేక నిలిచిన వైనం

- గతంలో కూలీలు.. ప్రస్తుతం లారీల కొరత
- సొసైటీలు, రైస్‌మిల్లర్లు కుమ్మక్కై తరుగు పేరిట దోపిడీ
- అధికారులు తనిఖీలు చేసి ఆదేశాలిస్తున్నా.. భేఖాతరు చేస్తున్న వైనం
- నిస్సహాయ స్థితిలో అన్నదాతలు
- పోలింగ్ తర్వాత పత్తాలేని నాయకులు, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-కామారెడ్డి

రైతే రాజంటారు. రైతు లేకపోతే రాజ్యమే లేదంటారు. అట్లాంటి రైతులు గోసపడుతుంటే.. పట్టించుకునే వారే కరువైయ్యారు. ధాన్యం కొనుగోలు తొలినాళ్లల్లో కూలీల కొరత నెలకొనగా.. ప్రస్తుతం లారీల కొరత వేధిస్తుంది. దీనికి తోడు కాని కాలంలో కురుస్తున్న అకాల వర్షాలు రైతులను ఆగమాగం చేస్తున్నాయి. ఇలాంటి దీనదుస్థితిలో సైతం రైతులపై కనికరం లేకుండా పలు సొసైటీలు, రైస్‌మిల్లర్లు కుమ్మక్కై తరుగు పేరిట నిలువు దోపిడీ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. అటు అధికార యంత్రాంగం ఇటు పాలకులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు తనిఖీలు చేపడుతూ ఎప్పటికప్పుడు ధాన్యం తరలించాలని, తరుగు తీయొద్దని ఆదేశాలిస్తున్నా పట్టించుకునేదెవరు..?

> కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా రబీలో 2,42,071 ఎకరాలలో రైతులు వరి పంటను సాగు చేశారు. మొత్తంగా ఆరు లక్షల 29 వేల, 385 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. అయితే ఇప్పటి వరకు 2 లక్షల 46 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయడం గమనార్హం.



దోమకొండలో లారీలు వచ్చినా.. ధాన్యం తడవడంతో ఆరబోత

ఎన్నికల వేళ రైతు చుట్టూ ప్రచారం చేపట్టిన ఆయా పార్టీలు.. ప్రస్తుతం పోలింగ్ ముగియగానే పత్తా లేకుండా పోయారని రైతులు వాపోతున్నారు.

తరుగు పేరుతో మోసం..

జిల్లాలో చాలాచోట్ల కొనుగోలు కేంద్రాలలో వడ్లను కాంటా చేసే సమయంలోనే 40 కిలోలకు ఒక సంచి నింపవలసి ఉండగా, అక్కడనే 42 కిలోల 300 గ్రాములు సంచిని తూకం వేస్తున్న విషయం బహిరంగ రహస్యమే. తూకం వేసిన ధాన్యం బస్తాలు రైస్ మిల్లులకు వెళ్లడానికి ఆలస్యమై వర్షాలు పడడంతో సంచుల కింది భాగంలో తేఏమ రావడంతో దాన్ని ఆరబెట్టాలని అనడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

అధికారులు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నా పలు సొసైటీలు రైతులను మోసం చేస్తూనే ఉన్నాయి. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిపోయిన రైతుల పరిస్థితులను ప్రభుత్వం అర్థం చేసుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం ఎటువంటి కోత విధించకుండా ఆన్‌లైన్ చేసుకొని ట్రాక్‌షీట్ జారీ చేయాలని అధికారులు చెబుతున్నా తరుగు మాత్రం తీస్తున్నారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేసిన రైస్ మిల్లులకు వెంటనే తరలిస్తూ అక్కడ 24 గంటల్లోగా ధాన్యాన్ని దించుకునేలా పర్యవేక్షించాలని పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ సూచిస్తున్నా.. క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. సమావేశాలు నిర్వహించి సూచనలిస్తున్నా.. క్షేత్రస్థాయిలో వాటిని అమలు చేసే వారు, వాటిని పట్టించుకునే వారు కరువైయ్యారు.

రైస్‌మిల్లర్ల లీలలు

ధాన్యం ఆరబెట్టి, తూకం వేసి లారీలు వచ్చే వరకు ధాన్యాన్ని కంటికిరెప్పలా కాపాడి తీరా రైస్‌మిల్లర్‌కు తరలిస్తే పలువురు రైస్‌మిల్లర్లు తమ లీలలు చూపెడుతున్నారు. ఇటీవల లింగంపేట్ మండలంలోని ఓ గ్రామం నుండి లోడుతో ఉన్న లారీ రైస్‌మిల్‌కు వెళ్లగా ఆ రైస్ మిల్ యజమాని వడ్లు బాగాలేవని ఇందులో వడ్లు నల్లబడ్డాయని సంచికి కిలో తరుగు తీసి ఇస్తే తీసుకుంటానని చెప్పడం గమనార్హం. కాగా ఇది వరకే తూకం వేసే సమయంలోనే సంచికి రెండు కిలోల తరుగు పేరిట అదనంగా తూకం వేశారని, మళ్లీ తరుగు తీస్తే.. క్వింటాకు 6 కిలోల చొప్పున తాము నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆ లారీలను ఐదు రోజులుగా అక్కడే ఉంచినట్టు సమాచారం. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే నేను ఎవరి ముందు అన్నాను వారిని తీసుకురండి అప్పుడే మీ లారీలో నుండి సంచులను దించుకుంటానని రైసుమిల్లరు తిరిగి రైతులనే దబాయిస్తున్నట్లు సమాచారం. లింగంపేట్ మండలం కొర్పల్ గ్రామం నుండి గత ఐదు రోజుల క్రితం 750 బస్తాలతో లారీ వెళ్లగా ఇప్పటివరకు లారీ రాక ఇక్కడ రైతులు తమ ధాన్యం వెళ్ళక ఇబ్బందులకు గురి అవుతున్నారు. తాము విషయాలు బయటపెడితే తమకు ముందు ముందు సొసైటీ అధికారులతో ఇబ్బందులు ఎదురవుతాయని కొందరు రైతులు తమ ఆవేదనను బయటకు చెప్పుకోలేకపోతున్నారు.

దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామంలో గత ఐదు రోజులుగా లారీలు రాక ఇబ్బంది పడ్డ రైతులు, గురువారం లారీలు రావడంతో సంతోషం వ్యక్తం చేశారు. తమ ధాన్యం రైస్‌మిల్లుకు తరలుతున్నంద ఆనందం వారిలో ఎక్కువ సేపు నిలవలేదు. ధాన్యం బస్తాలు కింద తడిచిపోయాయని వాటిని ఆరబెట్టాలని అనడంతో వారు ఆవేదనకు గురి అయ్యారు. ఇప్పటివరకు వర్షానికి తడిసి ఎండబెట్టి తడిసి ఎండబెట్టి చివరికి తూకం వేసి ధాన్యం బస్తాలు వెళ్తాయన్న సమయంలో తిరిగి మళ్లీ ఆరబెట్టాలని సొసైటీ అధికారులు అనడంతో రైతుల కండ్లు చెమ్మగిల్లాయి.

లెక్కల్లోనే ప్రణాళికలు..

ప్రతే దాది రెండుమార్లు ధాన్యం కొను గోలు చేస్తుంటారు. ప్రతిసారి నెలకొన్న ఇబ్బందులే తరుచూ రైతులకు ఎదురవుతుండటం గమనార్హం. రైతులకు ఇక్కట్లు రానీయొద్దని, కొనుగోలు సజావుగా సాగాలంటూ అధికార యంత్రాంగం సమావేశాలు, సమీక్షలు నిర్వహిస్తూ లెక్కలు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో నెలకొంటున్న ఇబ్బందులను పరిష్కరించే మార్గాలు మాత్రం కనుగొనలేకపోతున్నారు.

పత్తాలేని పాలకులు, నాయకులు

ఎన్నికల ప్రచారం సందర్భంగా రైతుల గురంచి ప్రగల్భాలు పలికిన పాలకులు, నాయకులు.. పోలింగ్ ముగియడంతో పత్తాలేకుండా పోయారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్టు చెబుతూనే.. తమ గోడు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారి ఓట్ల అవసరాలకు రైతులను వాడుకొని తర్వాత వదిలేయడం పాలకులకు, నాయకులకు పరిపాటిగా మారినట్టు వాపోతున్నారు.



సంచికి అదనంగా కిలో తరుగు

కుమ్మరి రవి. లింగంపేట మండలం, కోర్పోల్



గత ఐదు రోజుల క్రితం తన ధాన్యం తూకం వేసి లారీలో రైస్ మిల్ క పంపించారు. అక్కడికి వెళ్లిన తర్వాత వడ్లు బాగా లేవని సంచిక కిలో తరుగు తీస్తానని రైస్‌మిల్ యజమాని అంటున్నాడని లారీ డ్రైవర్ సమాచారం ఇచ్చాడు. ఈ విషయాన్ని సొసైటీ కార్యదర్శి మహిపాల్ రెడ్డిని అడగక అలాంటిదేమీ లేదని అన్నాడు. ఆ లారి వెళ్లి ఐదు రోజులు గడిచినా ఇప్పటివరకు తిరిగి లారీ రాలేదు. లారీలో నుండి వడ్లను దించుకోలేదు. మేము కాంటా వేసే సమయంలోనే రెండు కిలోలు అదనంగా తూకం వేశాం. 40 కిలోలకు బదులుగా 42.3 కిలోలు తూకం చేశాం.

నిత్యం ఏదోఒక సమస్య

రైతు, కుమ్మరి చంద్రం, దోమకొండ మండలం, సంగమేశ్వర్



మా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకోచ్చినప్పటి నుంచి ఏదో ఒక సమస్యను ఎదుర్కొంటూనే ఉన్నాం. కొన్ని రోజులు హమాలీలు లేక కాంటా జరగలేదు. హమాలీల వచ్చి కాంటాయిన తర్వాత లారీలు లేక మా ధాన్యం వెళ్లలేదు. ఇప్పుడేమో వర్షాలు స్టార్ట్ అయ్యాయి. ఈ బాధతలు ఒకెత్తయితే మరో వైపు రైతులతో అధికారులు ఆడుకుంటున్నారు. తరుగు పేరుతో 40 కిలోలు కాంటా వేసే సంచికి 42 కిలోల 300 గ్రాములు కాంటా వేస్తున్నారు. ఇలా ఎందుకు చేస్తున్నారంటే అందులో పొల్లు ఉంటుంది గడ్డి ఉంటుంది అని అంటున్నారు. సుమారుగా ఒక క్వింటాకు 4, 5 కిలోల నష్టపోవాల్సి వస్తుంది. ఇప్పుడు లారీలు వచ్చి రెండు రోజులు అవుతున్న దాంట్లో చేయడం లేదు. ధాన్యం సంచుల అడుక్కు తడి వచ్చిందని, ఆరబెట్టాలని అంటున్నారు. ఆరబెట్టిన తర్వాత రైస్ మిల్లుకు తీసుకెళ్లిన తర్వాత ఏమంటారో ఇంకా తెలవదు. అధికారులే క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి మా గోడు వినాలి.

పొల్లు పేరుతో తరుగు

సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్



పొల్లు పేరుతో సొసైటీ సిబ్బంది రైస్ మిల్లు యజమానులు కలిసి ధాన్యంలో తరుగు తీస్తూ రైతులను మోసం చేస్తున్నారు. ఒకవైపు అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతుండగా.. ఇటువంటి సమయంలో రైతులను పరిస్థితిని ఆసరా చేసుకుని పండించిన పంటను తొందరగా పంపించడం కోసం తరుగు పేరు మీద రైతులను మోసం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న కొంతమంది సిబ్బంది అదేవిధంగా రైస్ మిల్ యజమానులు కుమ్మక్కై రైతులను క్వింటాలకు 5 కిలోల చొప్పున తరుగు పేరుతో మోసం చేసి పంటను తరలిస్తున్నారు. ఇటువంటి తరుగు పేరుతో మోసం చేసిన వాటిని జిల్లా కలెక్టర్ స్పందించి సరైన దర్యాప్తును జరిపించి తరుగు పేరుతో ఇప్పటివరకు ఎంత ధాన్యం రైస్ మిల్లర్లు కు తరలించారో సంబంధించిన రైతులు అందరికీ ప్రతి కింటాలుకు ఐదు కిలోల చొప్పున ధర కట్టించి ఇవ్వాలి. తడిసిపోయిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలి.



ఆస్పత్రి ఎదుట ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న మృతుడి బంధువులు

ప్రయివేటు ఆస్పత్రి ధనదాహానికి యువకుడు మృతి

- సకాలంలో చికిత్స అందక మృతి
- ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేసినా అదనంగా రూ.80 వేలు వసూలు
- చనిపోయిన విషయం దాచిన ఆస్పత్రి వర్గాలు
- ఆస్పత్రి ఎదుట కుటుంబీకుల ఆందోళన.. సీపీకి, కలెక్టర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రయివేటు ఆస్పత్రి ధనదాహానికి యువకుడు మృతిచెందారు. సకాలంలో చికిత్స అందకపోవడంతో మృత్యువాత పడ్డాడు. పైగా చనిపోయిన విషయం సైతం సదరు ఆస్పత్రి వర్గీయులు దాచడం అనేక అనుమానాలకు తావిస్తుంది. ఈ ఘటన నిజామాబాద్ నగరంలోని ఎల్లమ్మగుట్టలోని ఓ కార్పోరేట్ ఆస్పత్రిలో చోటుచేసుకోగా కుటుంబీకులు, బంధువులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. బాధితుల వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం నిజాంపూర్ గ్రామానికి చెందిన పిట్ల నారాయణ (35) ఈ నెల 8వ తేదీనా ఉపాధి హామీ పని చేస్తుండగా.. ఛాతిలో నొప్పి రావడంతో హుటాహుటిన జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో గల ఓ కార్పోరేట్ ఆస్పత్రికి తరలించారు. టెస్టులు నిర్వహించి గుండె ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని చెప్పి ఆరోగ్య శ్రీ కింద చేస్తామని అయినా కానీ 80 వేలు రూపాయలు చెల్లించాలని ఆస్పత్రి యాజమాన్యం చెప్పింది. దీంతో అప్పు చేసి మరి రూ.80 వేలు చెల్లించగా.. వాటికి సంబంధించిన రిసిప్ట్ మాత్రం ఇవ్వలేదు. అయితే 10వ తేదీనా ఆరోగ్య శ్రీ నుంచి అప్రూవల్ సైతం వచ్చింది. డబ్బులు చెల్లించినా, ఆరోగ్య శ్రీ నుంచి అప్రూవల్ వచ్చినా.. చికిత్స మాత్రం చేపట్టలేదు. ఒక రోజు ఎన్నికలున్నాయని, మరో రోజు ఆపరేషన్ థియేటర్‌లో వేరే ఆపరేషన్‌లు ఉన్నాయని, ఇంకో రోజు సక్రమంగా లైట్లు పని చేయడం లేదంటూ బుకాయిస్తూ వచ్చారు. చివరగా గురువారం ఆపరేషన్ చేసి పేషెంట్‌ను ఐసీయూలో ఉంచారు. చూసేందుకు వెళ్తామన్నా కుటుంబీకులను అనుమతించలేదు. అనుమానంతో ఓ ఇద్దరు వెళ్లి చూడగా.. అప్పటికే మృతి చెందినట్టు ఉండటంతో కుటుంబీకులు ఆందోళన వ్యక్తం చేశారు. మృతిచెందిన విషయం సైతం దాచిపెట్టడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆస్పత్రి వైద్యుల తీరుపై బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఫ్లకార్డులు చేత పట్టుకొని నినాదాలు చేశారు. ఆరోగ్యశ్రీ వర్తించినా అదనంగా రూ.80 వేలు కట్టించుకున్నారని, అయినా చికిత్స సకాలంలో చేయకపోవడంతో మృతిచెందినట్టు వాపోయారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వహించిన ఆస్పత్రి యాజమాన్యంపై, వైద్యులపై కఠిన చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. మృతుడికి భార్య వసంత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మున్సిపల్ డ్రైవర్‌ల విధుల బహిష్కరణ



డ్రైవర్‌ల సమ్మెతో నిలిచిన చెత్తసేకరణ వాహనాలు

- పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- మద్దతు పలికిన సీపీఐ(ఎం).. మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా
- చర్చల్లో సానుకూలత రావడంతో ఆందోళన విరమణ



నినాదాలు చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు, మున్సిపల్ కార్మికులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేసే డ్రైవర్లు తమ సమస్యలను పరిష్కరించాలని అనేకమార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చి చర్చించి నప్పటికీ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడంతో శుక్రవారం ఉదయం నుండి మున్సిపల్ డ్రైవర్లు అంతా విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. వారికి సీపీఐ(ఎం) నాయకులు మద్దతుగా నిలిచి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు, కార్మికులు మాట్లాడుతూ .. ప్రధానంగా పెట్రోల్ బంక్ యజమానులు మున్సిపల్ వాహనాల్లో వేసే పెట్రోల్ రసీదులను డ్రైవర్లే డబ్బులు చెల్లించి పుస్తకాలను తీసుకెళ్లాలని, అదేవిధంగా కంప్యూటర్ బిల్లు పొందటానికి కావలసిన పేపర్ కొనుగోలుకు డ్రైవర్లే డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలిపారు. ఇటీవల ఒక డ్రైవర్ పైన పెట్రోల్ బంక్ నిర్వాహకులు దాడి చేశారని అన్నారు. వీటి పైన అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాటు వాహనాల రిపేరుకు లక్షల రూపాయలు ప్రైవేట్ మెకానిక్ షాప్‌లో తీసుకుంటున్నారని, తక్కువ ఖర్చులో వాహనాల మెయింటెనెన్స్ కొనసాగించుకోవటానికి మెకానిక్ షెడ్డును ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించినప్పటికీ, ఇంతవరకు దాన్ని ఏర్పాటు చేయలేదని అన్నారు. అదేవిధంగా మున్సిపల్ డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వేయి రూపాయల వేతనాన్ని మూడు నెలలు ఇచ్చి వాపోస్ తీసుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దాన్ని అమలు జరుపుతు న్నప్పటికీ నిజా మాబాద్ కార్పొరేషన్ లో మాత్రం కేవలం డ్రైవర్లకు మాత్రమే ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవి ధంగా చనిపోయిన కార్మికులకు 20వేల రూపాయలు దాహన సంస్కారాలకు ఇవ్వాలని, నిజామాబాద్ కార్పొరేషన్ లో అమలు జరపకపోవడంతో దశాబ్దాల పాటు పనిచేసిన కార్మికులకు కార్మికులే కొంత జమ చేసుకొని చెల్లిస్తున్నారని, ఈ రకమైన నిర్లక్ష్యం అధికారులు వీడి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించటంతో మున్సిపల్ కమిషనర్ స్పందించి చర్చలకు ఆహ్వానించారు. సమస్యలను పరిష్కరించడానికి సానుకూలంగా స్పందించడంతో ఆందోళన విరమించినట్టు తెలిపారు. ఈ ఆందోళన కార్యక్రమానికి మున్సిపల్ యూనియన్ నాయకులు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు పాల్గొని సంఘీభావాన్ని ప్రకటించి, వారికి అండగా ఆందోళనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డ్రైవర్ల యూనియన్ నాయకులు భూపతి ఏకనాథ్, సంతోష్ గౌడ్, కిరణ్, లక్ష్మణ్, మహేష్, బీఎల్‌టీయూ నాయకులు దండివెంకట్, రాజేందర్ తదితర నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ధాన్యం లెక్కలు తీయండి

- కోత కోయని, తూకం వేయని వివకరాలు సేకరించాలి
- అధికారులతో కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

వరి ధాన్యం కోయని రైతు పేరు, సాగు విస్తీర్ణం వివరాలను వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సేకరించే విధంగా మండల వ్యవసాయ అధికారులు చూడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం రాత్రి వ్యవసాయ, సహకార, సివిల్ సప్లై అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సహకార సంఘాల, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉన్న కుప్పల వివరాలు, ధాన్యం క్వింటాల వివరాలు అంచనా వేసి జిల్లా సహకార అధికారులు లెక్కలు తీసుకోవాలని తెలిపారు. కొద్దిగా ధాన్యమున్న కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపి కొనుగోలు తక్షణమే పూర్తి చేయాలని సివిల్ సప్లై అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యం ఉంటే దానిని బాయిల్డ్ మిల్లులకు పంపించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌లు శ్రీనివాస్ రెడ్డి, చంద్రమోహన్, జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి, సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బీమా చెక్కులు అందజేత

నవతెలంగాణ-బాన్సువాడ

ప్రమాదవశాత్తు వేర్వేరు కారణాలతో మృతిచెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కుటుంబాలకు పార్టీ బీమా చెక్కును మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. బాన్సువాడ గ్రామీణ మండలం బోర్లం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త జక్కా లక్ష్మణ్ మృతిచెందగా ఆయన భార్య జక్కు కాశవ్వకు , పోతంగల్ మండలం హంగర్గ ఫారం కు చెందిన కాంబ్లె దిలీప్ కుమార్ కు చెందిన చెక్కును భార్య సమతా భాయికి అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ బాధిత కుటుంబాలకు తన ప్రగాడ సానుభూతి వ్యక్తం చేశారు.

ఇటుక బట్టి కార్మికులకు దుస్తుల పంపిణీ

నవతెలంగాణ - మాక్లూర్

మండలంలోని వల్లభపూర్ గ్రామ శివారులోగల ఇటుక బట్టి కార్మికులకు చీక్లి గ్రామానికి చెందిన కొంపల్లి సాయి కుమార్ గౌడ్ దుస్తులను పంపిణీ శుక్రవారం చేశారు. కార్మికులు బట్టలు లేకుండా ఉండటాన్ని చూసి వారికి బట్టలు కొనియడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మహేష్, చింటు, రవి, చింటూ గౌడ్, రంజిత్ అసిఫ్ పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న కొంపల్లి సాయికుమార్ గౌడ్

లక్ష్మీ ప్రీతికి సన్మానం

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రానికి చెందిన జక్కుల ప్రవీణ్- రమాదేవి దంపతుల కూతురు జక్కుల లక్ష్మీ ప్రీతి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం ఆమెను జిల్లా కబడ్డీ అసోసియేషన్ తరుపున ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం అమ్మాయి హైదరాబాద్ లోని 'అవిష్కర్ కళాశాల'లో విద్యను అభ్యసిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డి, యువజన సంఘం సభ్యులు చిల్క దినేష్, నవీన్, గోపి, సంజీవ్, వినోద్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీ ప్రీతిని సన్మానించిన్న జిల్లా కబడ్డీ అసోసియేషన్

గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులకు సన్మానం



గ్రామ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్ పల్లి గ్రామఅభివృద్ధి కమిటీ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ నాయకులను కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల కార్యాలయం వద్ద అభివృద్ధి కమిటీ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన కాంగ్రెస్ నాయకులకు అభినందనలు తెలిపే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ అభివృద్ధి కమిటీ కోశాధికారిగా ఎన్నికైన నూకల మల్లయ్య, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన శివసారం గణేష్, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన జైడి బాలక్రిష్ణ లను సన్మానించారు. ఈ సందర్భంగా వారిని అభినందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దూలురి కిషన్ గౌడ్, ఉట్నూరి ప్రదీప్, సింగిరెడ్డి శేఖర్,సల్లూరి గణేష్ గౌడ్, పాలెపు చిన్న గంగారం, అజ్మతు హుస్సేన్, నల్ల సాయికుమార్, ఆ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్యాంపులో పాల్గొన్న క్షత్రియ ఇంజనీరింగ్ కాలేజీ ఎన్‌సిసి క్యాడేట్



సర్టిఫికెట్ అందుకుంటున్న కర్ణం సాయి స్వాగత్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ డిపార్ట్మెంట్ విద్యార్థి కర్ణం సాయి స్వాగత్ ఇటీవల నిర్వహించిన బెటాలియన్ లెవెల్, గ్రూప్ లెవళ్లతో పాటు ఫైరింగ్ కాంపిటీషన్లో పాల్గొని ఎంపిక కావడం జరిగిందని కళాశాల యాజమాన్యం అల్జాపూర్ గంగాధర్, అల్జాపూర్ దేవేందర్ శుక్రవారం తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్, కాకినాడ ,పెద్దాపురం నవోదయ స్కూల్లో జరిగిన జాతీయస్థాయి 10 రోజుల క్యాంపులో పాల్గొని వచ్చాడని అన్నారు. జాతీయస్థాయి సర్టిఫికెట్‌తో సత్కరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ కె పాండే, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్, ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విశ్వ స్ఫూర్తి ప్రతిభ పురస్కారాలు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

విశ్వకర్మ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు డివిజన్లోని అన్ని మండలాల్లోని పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విశ్వ బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కార కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డివిజన్ అధ్యక్షులు గద్దె గంగాధర్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఈ ఆదివారం 19న జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్లో ప్రతిభ పురస్కారాలను అందజేస్తున్నట్టు జిల్లా అధ్యక్షులు రాఘవాపురం గోపాల కృష్ణ చార్య తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరై, ఐక్యతను చాటి, విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపాలని వారు కోరారు.

అడుగడుగునా దళితులను మోసం చేస్తున్నారు

- జిల్లా అధ్యక్షులు కమలాపురం రాజన్న



మాట్లాడుతున రాజన్న

నవతెలంగాణ-ఆర్మూర్

కేంద్రంలో మోడీ ప్రభుత్వం దళితులను అడుగడుగునా మోసం చేస్తుందని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కమలాపురం రాజన్న అన్నారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 26న నిర్వహించనున్న నిజామాబాద్ జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అంటగడుతూ మున్ముందు ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ పిల్లలకు ఉద్యోగాలు రాకుండా చేస్తున్నారని అయన అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి డివిజన్ కన్వీనర్ మాదరి నరేష్ మాట్లాడుతూ.. రిజర్వేషన్స్ అమలుకు నోచుకోక దళితులకు సరైన ఉపాధి లేక విదేశాలకు వలసలు వెళుతున్న ఒక్క కుటుంబాన్ని కూడా ఆదుకోలేని తెలిపారు. మోడీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు మారుస్తానని చెప్పడానికి మోడీకి బీజేపీ నాయకులకు సిగ్గుందా అని అన్నారు. కరోనా కష్ట కాలంలో చనిపోయిన ఏ ఒక్క కుటుంబాన్నైనా ఆదుకున్నారా.. అని అయన ప్రశ్నించారు. దళితులను ఏకం చేయుటకు దళిత హక్కుల పోరాట సమితి జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని దళిత మేధావులు జయప్రదం చేయాలనీ కోరారు. సమావేశంలో మేకల సాయిలు, శీను, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

జూన్ 14లోగా పనులు పూర్తవ్వాలి

- అదనపు కలెక్టర్ అంకిత్

నవతెలంగాణ-భీంగల్‌రూరల్/కమ్మర్‌పల్లి

మండలంలోని కుప్కల్, పురాణిపేట్ గ్రామాల్లోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కొరకు విద్యుత్ సౌకర్యాలు, లైట్, ఫ్యాన్‌ల ఏర్పాటు టాయిలెట్ నిర్మాణం, రిపేర్లు మేజర్, మైనర్ రిపేర్ పనులు, తాగునీటి ఏర్పాట్లను అదనపు కలెక్టర్ అంకిత్ శుక్రవారం పరిశీలించారు. పాఠశాల రీ ఓపెన్ అయ్యే సమయానికి విద్యార్థులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోష్ కుమార్, ఏఈ మేఘన, వీఓ సంఘాలు. హెచ్ఎంలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్, హాసాకొత్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద జరుగుతున్న పనులను జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అంకిత్ శుక్రవారం సందర్శించి పరిశీలించారు. బషీరాబాద్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న విద్యుదీకరణ పనులను పరిశీలించారు. మండలంలోని 18 పాఠశాలలకు నిధులు మంజూరు కాగా 17 పాఠశాలలను ఇదివరకే పనులు ప్రారంభమయ్యాయని ఎంపీడీవో రాజ శ్రీనివాస్ అడిషనల్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30లోగా అన్ని పాఠశాలల్లో పనులను 100శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నతమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసమే అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఈ కార్యక్రమాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు చేపట్టడం జరుగుతుందని అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు. మహిళా సంఘ సభ్యులతో అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. పనులను దగ్గరుండి పర్యవేక్షణ చేయాలని ఈనెల 30వ తేదీలోపు పనులన్నీ వందశాతం పూర్తయ్యేలా చూడాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ పనులను కూడా జూన్ 12 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం హసకొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న విద్యుదీకరణ పనులను, టాయిలెట్ పనులను పరిశీలించారు. ఈ పనులన్నీ సకాలంలో పూర్తయ్యేలా చూడాలని ఎంపీడీవో రాజ శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసులు, ఐకెపి ఏపిఎం కుంట గంగాధర్‌ను ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ వెంట తహసిల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, ఏఈ శ్రీనివాసులు, మండల పంచాయతీ అధికారి సదాశివ్, ఏపిఎం కుంట గంగాధర్, సీసీలు నవీన్, భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, నరసయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్



భీంగల్ రూరల్‌లో..

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి

- జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్
- విత్తనాలు, ఎరువుల దుకాణాలు తనిఖీ

నవతెలంగాణ - మెండోర

మండలంలోని విత్తన, ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా ఎరువుల దుకాణాలలో సంబంధిత పత్రాలను, ఎరువుల నిల్వలని పరిశీలించారు. రానున్న వానకాలం సీజన్‌కి రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాల్సిందిగా దుకాణ యాజమానులకు ఆదేశాలు జారీ చేశారు. ఎరువులు, విత్తన వివరాల క్రయవిక్రయాల వివరాలు వ్యవసాయ శాఖ అధికారులకు కచ్చితంగా సమర్పించాలని ఆదేశించారు. పురుగుమందులు, ఎరువులు , విత్తనాలు ఇతర ఏదైనను విక్రయించిన సమయంలో రైతులకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా రైతులు లైసెన్స్ కలిగి ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్, ఎఈఓలు సాయికృష్ణ, అలేఖ్య , రాజేశ్వర్, రైతులు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్

ఖరీఫ్ పంటల ప్రణాళిక ప్రకటించండి

- ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య

నవతెలంగాణ - నిజామాబాద్ సిటీ

రబి సీజన్ పూర్తయి మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవు తున్నందున ప్రభుత్వం వానాకాలం పంటల ప్రణాళికను వెంటనే ప్రకటించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గల సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయం (ఎన్ఆర్) భవన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరిపడా అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పచ్చి రొట్ట, జీలుగ ఎస్సీ, ఎస్టీ రైతులకు, చిన్న , సన్నకారు రైతులకు ఉచితంగా ఇవ్వాలన్నారు. ఇతర రైతులకు 50 శాతం సబ్సిడీపై అందజేయాలని, ఎరువులపై పెరిగిన రేట్లను ప్రభుత్వమే భరించాలని అన్నారు. గతంలో విత్తనాలపై సబ్సిడీని ప్రభుత్వం ఎత్తివేసినందున ఆ సబ్సిడీని సైతం ప్రభుత్వమే భరించాలని తెలిపారు. పంటలకు బీమా పథకాన్ని ప్రభుత్వం కొనసాగించాలని, అకాల వర్షాలకు వడగండ్ల వానలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని ఇప్పటికే రైతులు అమ్ముకున్న ధాన్యానికి డబ్బులు అందించడంలో జాప్యం జరగకుండా వారి ఖాతాలో డబ్బులు వెయ్యాలని అన్నారు. దీంతోపాటు అన్ని రకాల వడ్లకు ఇతర పంటలకు 500 రూపాయలు బోనస్ చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం రైతులను చైతన్య పరిచే కార్యక్రమాలు చేపట్టడం లేదని, ఆత్మనిధులతో పంటలను పరిశీలించడానికి రైతులను టూర్లకు తీసుకు వెళ్లాలని, వ్యవసాయ రంగ నిపుణులతో రైతు సదస్సులను,క్లాసులను నిర్వహించి వారిని చైతన్యపరిచే కార్యక్రమాలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. అన్ని రకాల పంటలకు సీజన్‌కు ముందు మద్దతు ధరలు డాక్టర్. స్వామినాథన్ సూచించిన విధంగా పంట పెట్టుబడిలో 50 శాతం కలిసి ధరలు ప్రకటించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సమావేశంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయి రెడ్డి, ఉపాధ్యక్షులు తడకల కృష్ణ గౌడ్ , జిల్లా సహాయ కార్యదర్శులు అగ్గు చిన్నయ్య, బి.దేవ స్వామి, నాయకులు, డి.బస్సీ గుండ్ల నాగేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేల్పూర్ భూమయ్య

శేష వాహనంపై కొలువైన నారసింహుడు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

పట్టణంలోని పురాతన గ్రామాలయంలో శ్రీ లక్ష్మీ నృసింహుని జయంతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను శేష వాహనంపై ఊరేగించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన శేష వాహనంపై స్వర్ణభరణాలు అలంకరించిన శ్రీ లక్ష్మీ నృసింహుల ఉత్సవ విగ్రహాలను ఉంచి ఊరేగించారు. ఉత్సవాలను నంబి లింబాద్రి కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నారు.



శిఖం భూమి కబ్జా నుంచి కాపాడండి

- గ్రామస్తుల ధర్నా
- తర్మన్ చెరువులో మూడున్నర ఎకరాల భూమి పట్టా



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ - మాక్లూర్

మండలంలోని చిన్నాపూర్ గ్రామంలోని తిర్మన్ చెరువు కబ్జాకు గురైందని, అధికారులు పట్టా ఎలా చేశారని, తహశీల్దార్ కార్యాలయానికి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సుమారు వంద మంది వచ్చి ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ షబ్బీర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గురువారం తిర్మాన్ చెరువులో సర్వేయర్‌తో సర్వే చేసుకొని హద్దు రాళ్లు సైతం పాతడంతో గ్రామస్తులు చెరువులో ఎందుకు హద్దు రాళ్ళు వేస్తున్నారని ప్రశ్నించగా ఇది మా భూమి.. పట్టా ఉందని బెదిరించినట్లు తెలిపారు. దీనితో గ్రామ కమిటీ అధ్వర్యంలో మండల కార్యాలయానికి వచ్చి తహశీల్దార్ ను శిఖం భూమిని ఎలా పట్టా చేశారని ప్రశ్నించారు. దీనితో తహశీల్దార్ మాట్లాడుతూ ఇది నేను చేయలేనని, దీనిపై చెరువువద్దకు వచ్చి పరిశీలిస్తానని, దానిలో గ్రామానికి తప్పకుండా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. తీర్మాన చెరువులో 438/ఉ నెంబర్‌లో రెండు ఎకరాలు, 239 సర్వే నెంబర్‌లో ఒక్క ఎకరం 33 గంటల భూమి మామిడిపల్లి గ్రామానికి చెందిన పద్మశాలి దత్త్రాద్రి, ప్రణీత్‌కు గత వీఆర్ఓ బాలాగౌడ్, శిఖం భూమిని పట్టా చేసి ఇచ్చారని అన్నారు. చిన్నాపూర్ గ్రామ నుంచి ఎవ్వరూ కూడా వారికి అమ్మిన దాఖలాలు లేవని తెలిపారు. ఈ భూమిపై తగిన చర్యలు తీసుకొని శిఖం భూమిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు హబీబ్, మారుతి, చిన్న రెడ్డి, ఎంపిటిసి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ధార్న చేస్తున్న గ్రామస్తులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ - భీంగల్

భీమ్‌గల్ పట్టణ కేంద్రంలోని శ్రీ భారతి విద్యాలయం ఉన్నత పాఠశాలకు చెందిన 2001-02 ఎస్ఎస్‌సి బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. 23 సంవత్సరాల తర్వాత వేల్పూర్ రోడ్‌లోని ఎల్‌జె గార్డెన్స్‌లో అభిసింగ్ జయంత్ రావు స్మారక ప్రాంగణం వేదికగా ఒకచోట కలుసుకున్నారు. ఇన్ని సంవత్సరాల తర్వాత నాటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించి జ్ఞాపికను బహుకరించి ఉపాధ్యాయుల ఆశీస్సులు తీసుకున్నారు. సాయంత్రం వరకు సందడిగా ఆనందంగా స్నేహితులతో గడిపారు. కార్యక్రమానికి కంకణాల రాజేశ్వర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని శ్రీ నిమిషంభ దేవి వార్షికోత్సవంలో భాగంగా ఆలయంలో శుక్రవారం ఉదయం నుంచే అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, హోమం, కుంకుమార్చనలు, ఒడి బియ్యలు సమర్పణ చేశారు. అనంతరం శ్రీ నిమిషంభ దేవి అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌లోని మోహిదీ పట్నంకు చెందిన బ్రహ్మ రౌతు రాజ్ కుమార్, బి.వనజ, బి.వైష్ణవి, బి.సాయి విఘ్నేష్, లింబమ్మ. కుటుంబం వారు, మామిడి పల్లికి చెందిన చెందిన పోలకొండ హరికృష్ణ, పి.జయంతి, పి.సిద్ధార్థ, పి.సహస్ర ఆలయంలో ప్రత్యేక పూజలు అన్నదానం చేశారు. బాల్కొండ కు చెందిన బి.సత్యనారాయణ,బి.సునీత, బి.విజయ్, బి.వినయ్ కుటుంబం వారు 50కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసి అందజేత

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని నాగపూర్ గ్రామానికి చెందిన ఆరే మౌనిక కొంతకాలంగా లివర్ సమస్యతో బాధపడుతోంది. మెరుగైన చికిత్స, వైద్య సహాయం కోసం మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్‌ను సంప్రదించగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మూడు లక్షల రూపాయల ఎల్ఓసి మంజూరు చేయించారు. మంజూరైన ఎల్ఓసి ని శుక్రవారం మౌనిక కుటుంబ సభ్యులకు అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ బాల్కొండ మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ తెలిపారు.

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగావకాశాలు

నవతెలంగాణ-ముప్కాల్

యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా' స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగావకాశాలు ఉన్నాయని, ఈ అవకాశాన్ని జిల్లాలోని కబడ్డీ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంద్యాల లింగయ్య, కె.గంగాధర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న ఉదయం ఏడు గంటలకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకోదల్చిన వారు ఆధార్ కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రం, స్పోర్ట్స్ కోటాలో పొందిన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు. మరింత సమాచారం కోరకు ఈ కింది సెల్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

సూచిక బోర్డు ఏర్పాటు

- నవతెలంగాణ వార్తకు స్పందించిన కాంట్రాక్టర్

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి చౌరస్తాలో ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. ఆ పనుల సమీపంలో కల్వర్టు వద్ద వర్షాలకు మట్టి కొట్టుకుపోయింది. దాంతో 'ఆదమరిస్తే అంతే' అనే శీర్షికన ఈ నెల 13న నవతెలంగాణలో కథనం ప్రచురితమైంది. స్పందించిన కాంట్రాక్టర్ కొట్టుకుపోయిన మట్టిని పోయించి ఆ స్థలంలో సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. అలాగే కల్వర్టుపైన ఇనుప సువ్వాలు ఏర్పాటు చేసి రాత్రి వేళలో కనిపించేటట్లు రేడియం స్టిక్కరులు ఏర్పాటు చేశారు.


ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

గ్రామ మ్యాప్‌ను పరిశీలించిన ఎంపిడిఓ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మర్కల్ గ్రామంలో శుక్రవారం గ్రామ మ్యాప్‌ను ఎంపీడీవో సంతోష్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మ్యాప్ ద్వారా గ్రామంలోని చెరువులు.. అక్కడికి వెళ్లే రోడ్డు మార్గాలు వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి స్రవంతి, ఫీల్డ్ అసిస్టెంట్ రాములు తదితరులు పాల్గొన్నారు.


మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎంపిడిఓ

తాగునీటి సమస్య ఉండొద్దు

- ఎంపీడీవో శ్రీనివాస్

నవతెలంగాణ-రెంజల్

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సమక్షంలో గ్రామ కార్యదర్శులకు తాగునీటి సమస్యపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరాను నిరాటకంగా కొనసాగించాలని వారన్నారు. గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తినట్లు తమ దృష్టికి వస్తే ఆ కార్యదర్శిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గౌసొద్దీన్, ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ మునినాయక్, ఏఈ గబ్బర్‌సింగ్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్


సమావేశంలో పాల్గొన్న అధికారులు

వాటర్ లీకేజీ..

- రోడ్డుపై ఏర్పడిన గుంత


రహదారిపై ప్రమాదకరంగా మారిన గుంత


నవతెలంగాణ-వర్ని

మండలంలోని జాకోరా గ్రామంలో గత మూడు నెలల నుంచి వాటర్ లికేజీ అవడంతో రహదారిపై పెద్ద గుంత ఏర్పడింది. ఈ రహదారి గుండా పెద్దగుట్ట షాదుల బాబా దర్శనానికి, ఇతర గ్రామాలకు ప్రయాణికులు, వాహనదారులు నిత్యం వెళ్తుంటారు. రహదారిపై పైపు లీకేజీ వాటర్ గత మూడు నెలల నుంచి రోడ్డుపైన పారడంతో బాటసారులకు, వాహనదారులకు ఇబ్బందిగా మారింది. వాహనాలు గుంతలో పడితే ప్రమాదాలు చోటుచేసుకునే ఆస్కారం ఉంది. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుంతను పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే పైప్‌లైన్ లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.

మహాత్మా.. మన్నించు..

- శిథిలావస్థకు చేరిన మహాత్మాగాంధీ విగ్రహం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


విగ్రహానికి కాళ్ల వద్ద పగుళ్లు


శిథిలావస్థకు చేరిన విగ్రహం

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలో మహాత్మాగాంధీ విగ్రహం శిథిలావస్థకు చేరింది. అయినప్పటికీ స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. మహాత్మా గాంధీ విగ్రహం పాదాలు పూర్తిగా విరిగిపోయాయి. అలాగే కండ్లజోడూ లేదు. అక్టోబర్ 2వ తేదీన మహాత్మాగాంధీ జయంతిని, జనవరి 31న వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నా.. శిథిలాస్థకు చేరిన విగ్రహం స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలన్నా ఆలోచన రాకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శిథిలావస్థకు చేరిన విగ్రహాన్ని తొలగించి నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నీరు కలుషితం కావొద్దు

- ఎంపీడీవో గంగాధర్

నవతెలంగాణ-నిజాంసాగర్

గ్రామాల్లో నీరు కలుషితం కాకుండా చూడాలని, నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో గంగాధర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన తాగునీటిపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గంగాధర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సరఫరా విషయంలో ఇబ్బందులు రానీయకుండా ఎప్పటికప్పుడు సింగిల్ ఫేస్ మోటర్లు మరమ్మతులు చేయించాలన్నారు. అలాగే వచ్చేది వర్షాకాలమైనందున తాగునీటిని ఎట్టి పరిస్థితిలో కలుషితం కానివ్వకుండా చూడాలని ఆయన పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ఉపాధి హామీ పనులను అన్ని గ్రామాలలో చేయించాలని, నిర్దేశించిన కొలతల ప్రకారం పనులను చేయించాలని వివరించారు. ప్రతిరోజు 200 మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరయ్యేటట్టు చూడాలని ఆయన పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమలత, ఎంపీఓ యాదగిరి, ఏపిఓ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో గంగాధర్

వెదజల్లుతోన్న దుర్వాసన

- ఎడపల్లిలో అపరిశుభ్రంగా మురికి కాలువలు


డ్రయినేజీలో పేరుకుపోయిన చెత్తచెదారాం

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన గల మురికి కాలువలో చెత్తాచెదారం నిండిపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. గ్రామపంచాయతీ సిబ్బంది మురికి కాలువలను శుభ్రం చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మురికి కాలువలు శుభ్రం చేయకపోతే డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలే అవకాశముంది. ఇప్పటికైనా గ్రామపంచాయతీ సిబ్బంది స్పందించి మురికి కాలువలను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ధాన్యం సేకరణ త్వరగా పూర్తి చేయాలి

- ఐడిసిఎంఎస్ ఇంచార్జ్ చైర్మన్ ఇంద్ర సేనరెడ్డి

నవతెలంగాణ-దోమకొండ

అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఐడిసిఎంఎస్ ఇంచార్జ్ చైర్మన్ ఇంద్ర సేనరెడ్డి అన్నారు. బీబీపేట్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం సేకరణ త్వరగా చేపట్టడం లేదని రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టగా.. వెంటనే స్పందించి ఆయన వారిని సముదాయించారు. ఈ సందర్భంగా ఐడిసిఎంఎస్ ఇంచార్జ్ చైర్మన్ ఇంద్ర సేనరెడ్డి మాట్లాడుతూ.. అకాల వర్షానికి రైతులు ఆందోళన చెందవద్దని, రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రైతులకు హామీనిచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద గన్ని సంచులు, టార్పాలిన్లు, హమాలీలు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ధాన్యం సేకరణ త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రం వద్ద అధికారుల నిర్లక్ష్యం వల్ల, లారీల కొరత వల్ల గత కొన్ని రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నామని, ధాన్యం మ్యాచర్ వచ్చిన తర్వాత కూడా తూకం వేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేయగా.. వెంటనే ఐడిసిఎంఎస్ చైర్మన్ ఇంద్ర సేన రెడ్డి అధికారులతో మాట్లాడి ధాన్యం సేకరణ త్వరగా పూర్తి చేస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది, రైతులున్నారు.


ఆందోళన చేస్తున్న రైతులు

కార్యకర్తలే బీఆర్ఎస్‌కు మూల స్తంభాలు

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి


చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-వర్ని

కార్యకర్తలే బీఆర్ఎస్‌కు మూల స్తంభాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ సభ్యత్వం కట్టి మరణించిన కుటుంబ సభ్యులకు చెక్కులను పంపిణీ చేశారు. వర్ని మండలం ఉమ్మాపూర్ గ్రామానికి చెందిన సట్ట గంగామణి మరణించడంతో ఆమె బీఆర్ఎస్ పార్టీలో కట్టిన సభ్యత్వానికి రావలసిన ఆర్థిక సహాయాన్నిఆమె తల్లి సట్ట శివ్వకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన నివాసంలో ఆయన చేతుల మీదుగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీని నమ్ముకొన్న వారిని పార్టీ ఆదుకుంటుందని, పార్టీ సభత్వాలు ప్రతి గ్రామంలో ప్రజలు తీసుకొనేలా చూడాలని అన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన బీఆర్ఎస్ కుటుంబాలకు అండగా సభ్యత్వాలు ఉంటాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హుమ్నాపూర్ గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని 33 కెవి నిజాంసాగర్ ఫీడర్ ప్రిమనూసున్ ఇన్స్పెక్షన్ (పీఎంఐ) కారణంగా నిజాంసాగర్ మండలంలోని 33/11 కె.వి సబ్ స్టేషన్లు అయిన మల్లూరు, నర్సింగరావుపల్లి సబ్ స్టేషన్లలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న కర్ణాటక వ్యక్తులపై కేసు

- టిప్పర్ పట్టివేత

నవతెలంగాణ-మద్నూర్

ఎలాంటి అనుమతులు లేకుండా కుర్ల గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక టిప్పర్‌ను మేనూర్ శివారులో పోలీసులు పట్టుకున్నారు. ఆ ఇసుకను అక్రమంగా తరలిస్తున్న కర్ణాటకకు చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన తహసీల్దార్


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన్న తహసీల్దార్

నవతెలంగాణ-బిచ్కుంద

మండలంలోని పుల్కల్ రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బిచ్కుంద తహసిల్దార్ సురేష్ శుక్రవారం సందర్శించారు. వర్షాలు పడుతుండడంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వరి ధాన్యాన్ని వెంటవెంటనే తూకం వేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఇప్పటివరకు లక్ష 15 వేల బస్తాల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించినట్టు, మిగిలిన 4 వేల బస్తాల వరి ధాన్యాన్ని తూకం వేస్తున్నామని సీఈవో సాయి ప్రకాష్ తహసిల్దార్ సురేష్ దృష్టికి తీసుకు రాగా వెంటనే రెండు లారీలను తెప్పించారు. లోడింగ్ చేసి రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. రైతులతో మాట్లాడి ఎవరూ అధైర్య పడవద్దని రైతులకు భరోసా కల్పించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రైతులు, సిబ్బంది ఉన్నారు.

రైతులను ఆదుకోలేని బీఆర్ఎస్‌కు ప్రశ్నించే హక్కులేదు

- కాంగ్రెస్


నవతెలంగాణ-భిక్కనూర్

10 సంవత్సరాలలో రైతులకు పంట నష్టం జరిగితే రైతులను ఆదుకోలేని బిఆర్ఎస్ పార్టీకి, నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు లేదని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి అన్నారు. గురువారం కామారెడ్డి పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం భిక్కనూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వర్షాకాలం నుంచి రూ.500 బోనస్ చెల్లిస్తుందని అన్నారు. ఇప్పటివరకు 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని వివరించారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో కూడా పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకుందని తెలిపారు. ఆగస్టు 15వ తేదీలోపు 100శాతం రుణమాఫీ చేస్తామని, రైతులెవరూ ప్రతిపక్షాల మాటలు విని ఆందోళన చెందవద్దని, రైతులు అధైర్యపడవద్దని సూచించారు.

బిఆర్ఎస్ నాయకులకు ప్రభుత్వంపై రాళ్లు వేయడమే తప్ప వేరే పని లేక రోడ్డుపైకి వచ్చి ధర్నా చేస్తున్నారని విమర్శించారు. రైతులను మోసం చేసే అలవాటు కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని తప్పకుండా రైతులను ఆదుకుంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు లింబాద్రి, నరసింహారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులున్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సాలూరా సొసైటీలో జీలుగా విత్తనాలు పంపిణీ


విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలోని సొసైటీలో శుక్రవారం సొసైటీ సిబ్బంది సంజీవ్ రైతులకు జీలుగా విత్తనాలను పంపిణీ చేశారు. సొసైటీ పరిధిలోని రైతులకు జీలుగా విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 30 కిలోల జీలుగా విత్తనాల బ్యాగు రూ.1116 కే ప్రభుత్వం ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. కావున రైతులు పట్టాపాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకువచ్చి జీలుగ విత్తనాలు కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. జీలుగా విత్తనాలు వేయడం వలన భూమి సారవంతంగా మారి పంట దిగుబడి వచ్చే అవకాశం ఉందని, కావున రైతులు ప్రభుత్వం అందిస్తున్న జీలుగా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బోరుబావుల వద్ద వరి నారుమడులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని ఎడపల్లి, మంగళ్‌పాడ్, జైతాపూర్, తానాకలాన్, జానకంపేట్ ఆయా గ్రామాలలో బోరుబావులు కలిగిన రైతులు నారుపోశారు. జూన్ మాసం మొదటి వారంలోగా నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు రైతులు తమ పంట భూములను దుక్కులు దున్నుకున్నారు. గత రెండు మూడు రోజుల నుంచి వాతావరణంలో మార్పు రావడంతో రాత్రి వేళల్లో వర్షం పడుతుండటంతో పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు.


నారుపోసిన దృశ్యం

కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త రాజేశం అనారోగ్యంతో గురువారం మరణించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమ్‌రెడ్డి 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ధర్మయ్య, లింగారెడ్డి, మాజీ సర్పంచ్ స్వామి, ఎస్సీ సెల్ అధ్యక్షులు మహేష్, సిద్ధ రాములు తదితరులున్నారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

నేడు పలుగ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని సంస్థాన్ సిర్నపల్లి, గన్నారం సబ్ స్టేషన్, ఇందల్ వాయి33/11కెవి సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శని వారం ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇందల్ వాయి ఏఈ పండరి నాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థాన్ సిర్నపల్లి, గన్నారం,ఇందల్ వాయి సబ్ స్టేషన్ పరిధిలోని నల్లవెల్లి, స్టేషన్ తండా, డొంకల్, గౌరారం, మేగ్య నాయక్ తండా, గన్నరం,ఇందల్ వాయి, చంద్రయాన్ పల్లి, గంగారం తండా,తిరంగ పేట్‌తోపాటు ఆయా తండాల్లో సైతం విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని అయిన వివరించారు. మరమ్మతు పనుల ధృశ్య విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పండరి నాథ్ తెలిపారు. ప్రజలు, రైతులు, వ్యాపారులు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

విద్యుత్ అధికారులకు సత్కారం

నవతెలంగాణ-నవీపేట్



టీఎస్ఎన్‌పీడీసీఎల్ సిఎండి ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా విద్యుత్ శాఖలో గ్రామీణ ప్రాంతంలో ఉత్తమ ఏడిగా ద్వితీయ స్థానంలో నవీపేట్ ఏ డి సుహాసిని, ప్రథమ స్థానంలో ఎఇగా ప్రవీణ్ కుమార్ ఎంపిక కావడంతో డి ఈ శ్రీనివాస్ శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు మరింత విద్యుత్ సేవలు అందించాలని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి
- రిజిస్ట్రార్ ఎం యాదగిరి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ యాదగిరి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిగ్రీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం-యాదగిరి అన్నారు. శుక్రవారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన వివిధ పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లతో అకడమిక్ ఆడిట్ సెల్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయా కళాశాల పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరించే వారు పేపర్ డౌన్ లోడ్ చేసే సమయానికి విధిగా పరీక్ష కేంద్రంలో ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. చీఫ్ సూపరింటెండెంట్ లకు అనివార్యమైన, అత్యవసర పనుల ఏమైనా ఉంటే విధిగా అక్కడ పనిచేస్తున్న మరో అధికారికి లిఖిత పూర్వకంగా బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఇదే విషయాన్ని వర్సిటీ ఆడిట్ సెల్ లేదా పరీక్షల విభాగం అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. ఈనెల 21 నుండి జూన్ 15 వరకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 38 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించ నున్నట్టు తెలిపారు. 2, 4, 6 సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు దాదాపు 24 వేల మంది, 1, 3, 5 బ్యాక్లక్ పరీక్షల కు 14 వేల మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఎలాంటి లొసుగులు లేకుండా పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పరీక్ష పత్రం డౌన్ లోడ్ చేసే సమయంలో యూనివర్సిటీ నియమించిన అబ్జర్వర్స్‌తో పాటు ప్రిన్సిపల్ లేదా చీఫ్ సూపరింటెండెంట్ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ఈసారి పరీక్షల కు ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇన్విజిలేటర్ సెల్ ఫోన్‌లు వినియోగించ కూడదని ఆదేశాలను జారీ చేశారు. ఈ సమావేశంపై ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికీ కొంతమంది ప్రిన్సిపాళ్లు మరీ ముఖ్యంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గైర్హాజర్ అవడం పట్ల అసహనం వ్యక్తం చేసిన ఆయన ఆయా ప్రిన్సిపల్ ల నుండి వివరణ కోరాలని ఆడిట్ సెల్ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ గంటా చంద్ర శేఖర్,జాయింట్ డైరెక్టర్ అతీక్ సుల్తాన్ ఘోరీ పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి పాటుపడతా

- కాంగ్రెస్‌పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సునీల్‌కుమార్‌రెడ్డి





సునీల్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు

నవతెలంగాణ-మోర్తాడ్

మోర్తాడ్ గ్రామ అభివృద్ధికి తర్వాత సహాయ సహకారాలు ఎప్పుడు అందిస్తానని బాల్కొండ కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్చార్జి సునీల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మోర్తాడ్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అశోక్ ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు సునీల్ రెడ్డిని సన్మానించారు. మోర్తాడ్ గ్రామాన్ని దత్తత తీసుకొని గ్రామ అభివృద్ధికి సహకరించాలని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేయగా గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం తాను మోర్తాడ్ గ్రామంలోని నివాసం ఉంటున్నానని, తన సొంత గ్రామంగా భావించి గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని అన్నారు. తమ విన్నపాన్ని స్వీకరించి అభివృద్ధికి సహకరిస్తానన్న ముత్యాల సునీల్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ బుద్ధి కమిటీ అధ్యక్షుడు అశోక్, సభ్యులు రాజేందర్, అశోక్, రాజేశ్వర్, రాజ్ విట్టల్, హరీష్ గౌడ్, శివకుమార్, పృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య మోడల్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ







నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇందల్వాయి మండలంలోని ఏకలవ్య ఆదర్శ పాఠశాల విద్యార్థినులు పదో తరగతి(సీబీఎస్ఈ) ఫలితాల్లో తమ ప్రతిభను చాటారు. పాఠశాలలోని 70 మంది విద్యార్థినులు పరీక్ష రాయగా 70 మంది ం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ప్రథమ స్థానంలో అమృత వర్షిని (453/500) ద్వితీయస్థానంలో ఆర్. స్నేహ (436/500) తృతీయ స్థానంలో జయశ్రీ(402/500) మార్కులు సాధించినందుకు పాఠశాల ప్రిన్సిపాల్ జి. శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

ధాన్యం సేకరణను వేగవంతం చేయాలి

- వెంటదివెంట మిల్లులకు తరలించాలి
- యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు అందించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి
- అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తవ్వాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రాష్ట్ర వ్యాప్తంగాగల ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని, బడులు పున్ణ ప్రారంభం అయ్యే నాటికి పనులన్నీ పూర్తి కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. కొత్త విద్యా సంవత్సరంలో బడులు తెరుచుకునేందుకు మరో 20 రోజుల వ్యవధి మాత్రమే మిగిలి ఉన్నందున యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి గడువులోపు పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని హితవు పలికారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులతో పాటు, ధరణి దరఖాస్తులు, ప్రజావాణి అర్జీలు, ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ లక్ష్య సాధన అంశాలపై శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ప్రక్రియను రాష్ట్రంలో శాంతియుత వాతావరణంలో, సజావుగా నిర్వహించడం పట్ల అన్ని జిల్లాల కలెక్టర్లను సీఎస్ ముందుగా అభినందించారు. కాగా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో సగానికి పైగా జిల్లాలు దాదాపు 90 శాతం వరకు పనులను గ్రౌండింగ్ చేశాయని, మిగతా జిల్లాలు కూడా అన్ని పనులు గ్రౌండింగ్ అయ్యేలా చూడాలన్నారు. వివిధ దశల్లో కొనసాగుతున్న పనులను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని, అదే సమయంలో పనులు నాణ్యతతో జరిగేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ముఖ్యంగా బాలికలు ఉండే ప్రతి బడిలో తప్పనిసరిగా టాయిలెట్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మన ఊరు - మన బడి కింద ఇప్పటికే చేపట్టి వివిధ దశల్లో ఉన్న పనులను సైతం పూర్తి చేయించాలన్నారు. విద్యార్థులకు పాఠశాలల పునఃప్రారంభం సమయానికే స్కూల్ యూనిఫారంలు, పాఠ్య పుస్తకాలు అందించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఇప్పటికే అన్ని జిల్లాలకు యూనిఫామ్ క్లాత్‌ను సరఫరా చేయడం జరిగిందని, ఎక్కువ సంఖ్యలో మహిళా సంఘాలకు వర్క్ ఆర్డర్ ఇచ్చి, సకాలంలో వారు విద్యార్థుల సంఖ్యకు సరిపడా పూర్తిస్థాయిలో స్కూల్ యూనిఫామ్‌లు తయారు చేసి ఇచ్చేలా చూడాలన్నారు. ఇదిలా ఉండగా, ధరణి పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సీఎస్ సూచించారు. ఆర్డీఓలు, తహశీల్దార్లతో సమీక్ష ఏర్పాటు చేసుకుని, వివిధ మాడ్యూల్స్ కింద వచ్చిన దరఖాస్తులను ఈ నెలాఖరు లోగా వందకు వంద శాతం పరిష్కరించాలని అన్నారు. అలాగే, రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను సంబంధిత జిల్లాలకు పంపించడం జరుగుతోందని, వాటిని వెంటదివెంట పరిష్కరించాలన్నారు. పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ దృష్ట్యా తాత్కాలికంగా ప్రజావాణిని నిలిపివేయడం జరిగిందని, ఎన్నికల కోడ్ ముగిసిన మీదట యధావిధిగా కొనసాగుతుందని సీఎస్ స్పష్టం చేశారు. ప్రజావాణి తిరిగి ప్రారంభించే లోపు పెండింగ్ అర్జీలను పరిష్కరిస్తూ, దరఖాస్తుదారులకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. కాగా, కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి ధాన్యం సేకరణను వేగవంతం చేస్తూ, వెంటదివెంట నిల్వలను రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. అదేసమయంలో మిల్లులు పూర్తి స్థాయి సామర్థ్యం మేరకు మిల్లింగ్ జరిపేలా పర్యవేక్షణ చేస్తూ, సీఎంఆర్ లక్ష్య సాధనకు కృషి చేయాలని అన్నారు. ఈ విషయమై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పందిస్తూ, ఈ దిశగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్, డీఎస్ఓ చంద్రప్రకాష్, సివిల్ సప్లైస్ డీ.ఎం జగదీశ్, డీఈఓ దుర్గాప్రసాద్, డీసీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ప్రతి వేడుకలోనూ ప్రదర్శనలు

- నృత్యంలో రాణిస్తున్న నటరాజ నృత్య నికేతన్ చిన్నారులు

నవతెలంగాణ-ఆర్మూర్

తమ పిల్లలు చదువు, ఆట పాటలతో పాటు నృత్య ప్రదర్శనల్లో మెలకువలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని, వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇందుకోసం పట్టణంలోని గంగ హాస్పిటల్ దగ్గర గల నటరాజ నృత్యానికేతన్ నిర్విరామ కృషి చేస్తుంది. ప్రతిరోజు పుస్తకాలతో కుస్తీపట్టే చిన్నారులు తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహంతో సాంప్రదాయ నృత్యాలపై ఆసక్తి చూపుతున్నారు. భిన్న రీతులను అన్వయిస్తూ భంగిమలు అవలీలగా అనుసరిస్తున్నారు. ప్రత్యేక సందర్భాలు, పర్వదినాలు, స్వతంత్ర, గణతంత్ర దినోత్సవాల్లో సైతం ప్రదర్శనలు ఇస్తూ వీక్షకులను అలరిస్తున్నారు.

జిల్లా, రాష్ట్రస్థాయి ప్రదర్శనలో సైతం..

రాష్ట్రపతి అవార్డు గ్రహీత, నటరాజ నృత్యానికేతన్ వ్యవస్థాపకులు మాడ వేడి నారాయణ సారథ్యంలో ఎందరో పలు కార్యక్రమాల్లో పాల్గొని ప్రముఖులతో ప్రశంసలు, అవార్డులు సైతం పొందారు. గతంలో రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో మహా శివరాత్రి సందర్భంగా సనాతన సాంస్కృతి సంస్థ నిర్వహించిన నృత్యోత్సవంలో 18 మంది చిన్నారులు పాల్గొన్నారు, మహానంది పురస్కారాలతో పాటు ప్రశంస పత్రాలు అందుకున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో నటరాజ నృత్యానికేతన్ చిన్నారుల నృత్య ప్రదర్శనలు అందరిని అలరించి ప్రశంసలు పొందారు. పిల్లలు విభిన్న కళల్లో ప్రవేశం ఉండాలన్న తపన, ఆదరణ పెరగడానికి కారణం. అలా నేర్చుకున్న చిన్నారులు గుర్తింపు పొందడం మరింత ఉత్సాహపరుస్తుంది. శాస్త్రీయ నృత్యంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా ఉండడానికి దోహదం చేస్తుంది. ప్రతి రోజు టీవీ, స్మార్ట్ ఫోర్డ్ చూసే కంటే నృత్య సాధన చేయడంతో వ్యాయామం అవుతుంది. శరీరం అలసిపోవడంతో నిద్రలేమి సమస్య అధిగమించవచ్చు. ఇలాంటి అంశాలు ఇమిడి ఉండడంతో తమ పిల్లలకు నృత్యం నేర్పించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు .సాంప్రదాయ నృత్యంతో చిన్నారుల్లో క్రమశిక్షణ పెరుగుతుందని చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించే అవకాశం ఉంటుందని నాట్య గురువు బా శెట్టి మృణాళిని తెలిపారు..

ప్రతి వేడుకలోనూ...

చిన్నారులు మండల, జిల్లా ,రాష్ట్ర స్థాయిలో ప్రదర్శనలతో పాటు స్థానిక వేడుకల్లోనూ అలరిస్తున్నారు. పాఠశాల వార్షికోత్సవాలు, స్వతంత్ర, గణతంత్ర, సాహితి వేడుకల్లో చిన్నారులు తమ నాట్య ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నారు. ఈ చిన్నారుల ప్రదర్శన లేనిదే వేడుక ముగియదన్నట్లుగా తయారైంది.



ప్రశంసాపత్రాలు అందుకున్న నృత్య విద్యార్థులు

ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ



మాట్లాడుతున్న మహేష్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పోషమైన మహేష్ మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు, విద్యార్థులు అనేకమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. అయితే జెఎన్టియు నుండి కూడా కళాశాల ఏర్పాటుకు అనుమతి లభించిన ఏర్పాటు మాత్రం జరగలేదని అన్నారు. అనేక సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా మార్చుకోవడానికి అన్ని సదుపాయాలు ఉన్నాయని గతంలోనే ప్రభుత్వానికి నివేదికలు పంపించిన గత ప్రభుత్వం ఆ రకమైన కృషి మాత్రం చేయలేదని అన్నారు. అయితే ఇప్పుడు నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారందన్నారు. ఈమధ్యకాలంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా నిజామాబాద్ జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని బహిరంగంగా ప్రకటించారని తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు జరిగుతే అనేక వందల మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యను అభ్యసించడానికి వీలు కలుగుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని క వెంటనే ఇక్కడున్నటువంటి ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని ఈ విద్యా సంవత్సరం ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసే రకంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నగర సహాయ కార్యదర్శి ఆజాద్, నగర కమిటీ సభ్యులు వేణుగోపాల చారి, నాయకులు మారుతి, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగల వారిని వీసీగా నియమించాలి

- టీయూ పిడిఎస్‌యూ డిమాండ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీకి నిజాయితీగల వారిని వైస్ ఛాన్సలర్ గా నియమించాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీ టీయూ పిడిఎస్‌యూ కమిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ బాయ్స్ హాస్టల్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ పాలకులు అన్ని యూనివర్సిటీలను భ్రష్టు పట్టించారని, గత సీఎం యూనివర్సిటీ లను పట్టించుకోకుండా విధ్వంసం చేశారని అన్నారు. యూనివర్సిటీలను రక్షించాల్సిన బాధ్యత, అధిక నిధులు కేటాయించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వాన్నిదేనని పేర్కొన్నారు. గతంలో యూనివర్సిటీలను ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని, అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిందని, దానికోసం తెలంగాణ యూనివర్సిటీకి వంద కోట్లు నిధులు కేటాయించి అభివృద్ధి కి పాటుపడాలని అన్నారు. నీతిమంతులను వైస్ ఛాన్సలర్‌గా తీసుకురావాలని, నిర్ణయాలను ఎప్పటికప్పుడు అమలు చేసే వారిని విసి, రిజిస్టర్ లుగా నియమించాలని తెలిపారు. గతంలో పాలకమండలి చేసిన నిర్ణయాలను అమలు చేయలేదని, అవినీతి వీసి దొరికిన యూనివర్సిటీని ప్రక్షాళన చేయలేదని అన్నారు. యూనివర్సిటీల మీద ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని, యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ పైన పట్టు, పరిశోధనల మీద నైపుణ్యత, నిజాయితీగలవారిని వైస్ ఛాన్సలర్‌గా నియమించాలని కోరారు. కార్యక్రమంలో టీయూ పిడిఎస్‌యూ నాయకులు రవీందర్, వంశీ, గోపి, రాజు, తదితరులు పాల్గొన్నారు.


అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం

- రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తుంది
- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం తన నిజస్వరూపాన్ని చూయించిందని, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటి అమలు చేయటం లేదన్నారు. సెప్టెంబర్ 9న రైతు రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చి 5 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు రుణమాఫీ చేయలేదన్నారు. ఆగస్టు 15 తర్వాత రుణమాఫీ చేస్తామని రైతులను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సన్న వడ్లకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామని చెప్పటం సిగ్గు చేటని అన్నారు. దొడ్డు వడ్లకు కూడా రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఎన్నికల్లో అడ్డగోలు హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందన్నారు. వారి బూటకపు మాటలు నమ్మి ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారని, ఇప్పుడు ప్రజలే బాధపడుతున్నారని అన్నారు.

రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాల్సిందే నన్నారు. తెలంగాణ ప్రజలను, రైతులను ఆదుకునేది ఒక్క బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని, ప్రజలకు రైతులకు అండగా ఉండి వారి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్ హయాంలో కరెంట్ ఉండటం లేదని, బోరు మోటార్లు కాలిపోతున్నాయని విమర్శించారు. ఆగస్టు 15 లోగా రుణమాఫీ చేస్తామని సిఎం చెబుతున్నాడని, అప్పటిలోగా అన్ని రకాల ఎన్నికలు పూర్తవుతాయన్నారు. అనంతరం ఖజానాలో డబ్బులు లేవని మరోసారి రైతులను మోసం చేసే అవకాశముందన్నారు. తాను ఎంపీగా గెలిస్తే ఇంకా బాగుంటుందని, గెలిచిన, ఓడిన ప్రజల మధ్యలో ఉండి సేవ చేస్తానని బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. ఆర్టీసీ సంస్థను ప్రభుత్వం ఆదుకోవాలని, ఇప్పటికే బకాయిలున్న 14వందల కోట్లను చెల్లించటంతో పాటు సంస్థకు ఇవ్వాల్సిన వెయ్యి కోట్ల గ్రాంటును వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలను అధికార పార్టీ నాయకులు ఇబ్బంది పెడుతున్నారని, ఎవరిపైనైనా తప్పుడు కేసులు బనాయిస్తే తానే పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి ధర్నా నిర్వహించి అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఇందల్వాయి ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, నియోజకవర్గంలోని మండల అధ్యక్షులు మహిపాల్ యాదవ్, మొచ్చ శ్రీనివాస్, చింతల గంగాదాస్, శ్రీనివాస్, మధుకర్రావు, నాయకులు కుంచాల రాజు, నల్ల హన్మంత్రెడ్డి, శక్కరికొండ కృష్ణ, చింత మహేష్, పద్మారావు, ఒడ్డెం నర్సయ్య, కో ఆప్షన్ సభ్యులు షేక్ నయీమ్, మోహమ్మద్ యూసఫ్, పాశంకుమార్, గంగాదాస్, నల్లవెల్లి సాయిలు, కిషన్‌రెడ్డి, చిరంజీవి, అంజయ్య, లింగం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

రంగ చెరువు మరమ్మతుకు నిధులు మంజూరు



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రామారెడ్డి పరిసర ప్రాంతంలో గల రంగ చెరువు అలుగు తెగిపోవడంతో, మరమ్మతు కోసం రూ.4లక్షలు మంజూరైనట్లు జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌ను కలిసిన సందర్భంగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఆనాడు మరమ్మతు కోసం రైతుల పక్షాన పోరాడిన, బీఆర్ఎస్ ప్రభుత్వం స్పందించలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిధులు మంజూరు చేయించామని, వచ్చే నెలలో టెండర్ పిలిచి, వర్షాకాలంలోపు పనులు పూర్తి అయ్యేలా కృషి చేస్తామని అన్నారు.

20న బీడీ టేకేదార్ కమీషన్ రేటు ఒప్పందంపై చర్చలు

- బిఎల్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సిద్ధిరాములు

నవతెలంగాణ-కామారెడ్డి

ఈనెల 20న నిజామాబాద్ నిఖిల్ సాయి ఇంటర్నేషనల్ హెూటల్లో జరిగే బీడి టేకేదార్ కమీషన్ రేటు ఒప్పందంపై బీడీ యజమాన్యంతో జరిపే చర్చలను విజయవంతం చేయాలని బి.ఎల్.టి.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ సిద్ధిరాములు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీడీ పరిశ్రమలో పనిచేసే బీడీ టేకేదార్లకు బీడీ యాజమాన్యం, బీడీ టేకేదార్ సంఘాలతో వెయ్యి బీడీలకు కమీషన్ రేటు ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుందని, కిందటి ఒప్పందం 31-3-2024 నాటికి ముగిసిందని తెలిపారు. నూతన కమీషన్ రేటు ఒప్పందం చేసుకోవలసి ఉందని, తెలంగాణ బహుజన బీడీ టేకేదార్ యూనియన్, బిఎల్‌టీయూ నుంచి 28-2-2024న డిమాండ్ నోటీసును అందజేసినట్టు వివరించారు. ఈ విషయంలో బీడీ యజమన్యం సంఘం స్పందించి 20-5-2024న సాయంత్రం 3 గంటలకు నిజామాబాద్ నికిల్ సాయి ఇంటర్నేషనల్ హెూటల్‌లో చర్చలకు పిలిచిందని పేర్కొన్నారు.

స్కూళ్లల్లో మౌలిక వసతులు కల్పించాలి

- జూన్ మొదటి వారం వరకు పనులు పూర్తి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-లింగంపేట్





పాఠశాలలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలను రూపకల్పన చేయనున్నట్టు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో మండల విద్యాధికారులు కలెక్టర్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన శుక్రవారం పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో తరగతి గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, విద్యుత్, పాఠశాల పైకప్పులు పెచ్చులూడడంతో ప్రత్యామ్నాయంగా విద్యా సంవత్సరానికిగానూ పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. బాలికల ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షాకాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని, ప్రత్యామ్నాయంగా పాఠశాల నాలుగు గదులు పైకప్పులు తొలగించి విద్యార్థులకు ప్రత్యామ్నాయంగా సిమెంటు రేకులతో పైకప్పు ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ ఏఈ రాకేష్‌ను ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఉన్నత పాఠశాలలో 260 మంది విద్యార్థినీలకు ఒకటే మరుగుదొడ్డి, మూత్రశాల ఉండడంతో త్వరలోనే రెండు మూత్రశాలలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని వాటికి నీటి సౌకర్యం కల్పించాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశపుగది పెచ్చులూడి పందికొక్కులు సంచరించి విలువైన ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడంతో గదులకు వెంటనే మరమ్మతు చేయించాలన్నారు. తరగతి గదుల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. షార్ట్ సర్క్యూట్ రాకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. అనంతరం బాలుర పాఠశాలను సందర్శించారు. పాఠశాల వంటగదిలేకపోవడంతో ప్రత్యామ్నాయంగా షెడ్డును ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. మౌలిక వసతుల కోసం నాలుగు లక్షల రూపాయలు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. పాఠశాల సమీపంలోని పాత పోలీస్‌స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పోలీస్ స్టేషన్ భవనాన్ని పాఠశాలకు అప్పగించాలని విద్యా కమిటీ సభ్యులు, మహిళా సంఘాలు గ్రామస్తులు సూచించడంతో ఆయన సానుకూలంగా స్పందించి జిల్లా పోలీసు అధికారులకు దరఖాస్తు పెట్టుకోవాలని ఆయన సూచించారు. పోలీస్ స్టేషన్ పాత భవనం వృథాగా ఉండడంతో భవనం కూల్చివేస్తే క్రీడలు ఆడుకోవడానికి ఉపయోగపడుతుందని అన్నారు. వెంటనే పాఠశాల ప్రధానోపాధ్యాయులు జిల్లా పోలీసులతో అధికారులకు దరఖాస్తు చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా 1000కి పైగా అమ్మ ఆదర్శ పాఠశాలలో మరమ్మతులు చేపట్టనున్నట్టు వివరించారు. జూన్ మొదటి వారం నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, మరుగుదొడ్ల పునర్నిర్మాణ పనులు చేపడుతున్నట్టు వివరించారు. ప్రతి పాఠశాలకు నిధులు విడుదల చేశామని తెలిపారు. ఆయన వెంట మండల విద్యాధికారి రామస్వామి, పంచాయతీరాజ్ ఏఈ రాకేష్, ఎమ్మార్వో నరేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభ రాణి, సూరయ్య, ఐకెపి సిసిలు మెహర్, గంగరాజు, మన్సూర్, మహిళా సంఘాల అధ్యక్షులు, ఎస్ఎంసి కమిటీ సభ్యులు తదితరులున్నారు.

మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రవేశలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ భానుమతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 చివరి తేదీ అని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు మోడల్ స్కూళ్లలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఆంగ్ల మాధ్యమంలో చేరాలనుకునే వారు ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఒక్కో దాంట్లో 40 సీట్లు ఉంటాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.tsmodelschools.com వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు.

ఉన్నత చదువుల కోసం స్కాలర్‌షిప్ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానం

- జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ

నవతెలంగాణ-కామారెడ్డి

నేషనల్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ పథకం కింద 2024-25 సంవత్సరంలో ఉన్నత చదువుల కొరకు గిరిజన విద్యార్థిని, విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 31లోగా https://overseas.tribal.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులుగా సుజిత్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులుగా ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన సుజిత్‌ను నియమించారు. ఈ మేరకు శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం సుజిత్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు అంకిత భావంతో పనిచేస్తానని, క్రిస్టియన్ మైనార్టీల సమస్యలను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తనను నియమించినందుకు ఎమ్మెల్యేకు, పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో గురువారం రాత్రి ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో మూడు పెంకుటిండ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.25లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన యువకులు అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఛత్రపతి విరామాని కుమారుడు అనిల్ కుటుంబానికి ఎస్సెస్సీ బ్యాచ్ స్నేహ బృందం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ.40 వేలను శుక్రవారం ఆర్థిక సహాయం అందించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని.. అండగా ఉంటామని తెలిపారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసానిచ్చారు. ఆర్థిక సాయం చేసిన వారిలో బృందం సభ్యులు మోహన్‌గౌడ్, అరవింద్ గౌడ్, నవీన్ గౌడ్, రాజశేఖర్, షేక్ సాదిక్, రెహన్, మహేష్, సందీప్, ప్రదీప్ రియాజ్ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

బోనాల్‌లో పెద్దమ్మ తల్లి బోనాల ఊరేగింపు

- జిల్లా అధ్యక్షుడు బట్టు విట్టల్ ముదిరాజ్



బోనాల ఊరేగింపులో పాల్గొన్న ముదిరాజ్‌లు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని బోనాల గ్రామంలో శుక్రవారం పెద్దమ్మతల్లి బోనాల ఊరేగింపు నిర్వహించారు. ముదిరాజుల ఆరాధ్యమైన పెద్దమ్మతల్లికి ఇంటింటికి ముదిరాజ్ కులస్తులు బోనాలు అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పు సప్పుళ్లతో, పోతరాజుల విన్యాసం, శివసత్తుల పూనకాలతో ఊరేగింపు రంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ ఊరేగింపు పెద్దమ్మ తల్లి ఆలయం వరకు కొనసాగింది. ఆలయం చుట్టూ ఐదుసార్లు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు డాక్టర్ భట్టు విఠల్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజుల జాతి సంస్కృతిని ప్రతిబింబించే పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో అందరూ ఐక్యంగా ఉండాలని కోరారు. ఆర్థిక ప్రగతిని సాధించే దిశగా జాతి గౌరవాన్ని పెంచడానికి ప్రతీ ముదిరాజ్ కృషి చేయాలని కోరారు. తెలంగాణలో అమ్మవారి ఆలయాల నిర్మాణానికి 50లక్షల రూపాయలు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు బాలయ్య, హనుమంతు, లక్ష్మీనారాయణ, సంగయ్య, మైసయ్య, కిష్టయ్య పిల్లలు పెద్దలు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి

- తహసిల్దార్‌కు వినతి



వినతిపత్రాన్ని అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ మహేందర్‌కు ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని బి.ఎస్.పి పట్టణ అధ్యక్షులు సాయిబాబా ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి పట్టణంలో ఒకే ఒక ఆధార్ సెంటర్ ఉండటం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ఆధార్ అప్‌డేట్ కోసం రోజుల తరబడి లైన్‌లో వేచి ఉండాల్సి వస్తుందని అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలో మరో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేస్తే స్థానిక ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు లింగమయ్య, సాయికుమార్, అంబేద్కర్ సంఘం నాయకులు సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగా విత్తనాలు

నవతెలంగాణ-ఎడపల్లి

మండల రైతులకు సబ్సిడీపై జీలుగా విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఎడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బంది శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ సహకారంతో జీలుగా విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. జీలుగా బస్తా ధర రూ.2079 కాగా సబ్సిడీ రూ.1674 పోను రైతులు రూ.1116 చెల్లించి విత్తనాలు పొందాలని సూచించారు. 2.5 ఎకరాల గానూ ఒక బ్యాగ్ మాత్రమే పంపిణీ చేయనున్నట్టు వివరించారు. ఒక్క రైతుకు మూడు బ్యాగులు మాత్రమే అందజేస్తామని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతులు అధైర్యపడవద్దు

- ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం
- జిల్లా పౌర సరఫరా అధికారి మల్లికార్జున్ బాబు

నవతెలంగాణ-కామారెడ్డి

కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్యపడవద్దని జిల్లా పౌర సరఫరా అధికారి మల్లికార్జున్ బాబు శుక్రవారం తెలిపారు. రైస్ మిల్లులలో గత యాసంగి, వానాకాలానికి సంబంధించిన ధాన్యం నిలువలు ఉండడం, స్థలాభావం వల్ల ప్రస్తుత యాసంగి ధాన్యం అన్‌లోడ్ చేసుకోవడంలో కాస్త ఆలస్యమవుతున్నదని అన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మిల్లులలో స్థలాన్ని సర్దుబాటు చేసుకొని త్వరితగతిన అన్‌లోడ్ చేసుకొని లారీలను తిప్పి పంపవలసినదిగా రైస్ మిల్లర్లను ఆదేశించామన్నారు. అదేవిధంగా ధాన్యాన్ని ఇతర జిల్లాలకు తరలించుటకు తగుచర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాగా నిజాంసాగర్ మండలం కోమలంచలో ధాన్యం సేకరణ మెల్లగా జరుగుతున్నదని రైతులు ధర్నాకు దిగగా వారికి సమస్యను వివరించి వెంటనే కేంద్రానికి లారీలు పంపి అక్కడి నుంచి సమీప రైస్‌మిల్లుకు ధాన్యం తరలించామని, రైతులు ధర్నాను విరమించారని ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు అవసరమైన లారీలను వెంటవెంటనే సమకూర్చవలసినదిగా ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌ను ఆదేశించామని పేర్కొన్నారు. కేంద్రం నిర్వహకులు కూడా ధాన్యం తూకం వేసిన వెంటనే ట్యాగింగ్ చేసిన మిల్లులకు తరలించాలని ఆదేశించారు.

చెత్తచెదారాన్ని యుద్ధ ప్రాతిపదికన తొలగించాలి

- పారిశుధ్యంపై ఆగ్రహించిన డిఎల్పీఓ

నవతెలంగాణ-బిచ్కుంద



సూచనలు చేస్తున్న డీఎల్పీఓ

మండల కేంద్రంలోని వీధులలో చెత్తాచెదారం పేరుకుపోయి తమ దృష్టికి వచ్చిందని వెంటనే పారిశుధ్య కార్మికులతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి చెత్తాచెదారాన్ని తొలగించాలని కార్యదర్శితో పాటు సిబ్బందిపై డిఎల్పిఓ నాగరాజు ఆగ్రహించారు. శుక్రవారం డిపీవో ఆదేశాల మేరకు బిచ్కుంద గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది సమయ పాలన పాటించటం లేదంటూ గ్రామస్తుల ఫిర్యాదు మేరకు డిఎల్పిఓ సందర్శించారు. అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించి సిబ్బంది సమయపాలన పాటించాలంటూ హెచ్చరించారు. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బందికి ఇన్సూరెన్స్ చేయించాలని ప్రీమియం డబ్బులు గ్రామపంచాయతీ నుంచి చెల్లించాలని అన్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి గ్రామపంచాయతీ స్థలాల్లో షెడ్లు వేసుకొని కొందరు గ్రామపంచాయతీ పన్ను కట్టడం లేదంటూ సిబ్బంది డిఎల్పిఓ దృష్టికి తీసుకురాగా వెంటనే వారికి నోటీసులు జారీ చేసి ఖాళీ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

జోరుగా ఉపాధి హామీ పనులు

నవతెలంగాణ-బోధన్



సంగెం గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనులు

గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను కూలీలు జోరుగా చేపడుతున్నారు. ప్రస్తుతం చెరువులలో పూడికతీత పనులు చేపడుతున్నారు. చెరువులలో నీటి సామర్థ్యం పెంచడానికి ఉపాధి హామీ ద్వారా చెరువు పూడికతీత పనులు చేపడుతున్నారు. చెరువులోని మట్టి భూసారం పెంచడానికి ఉపయోగపడుతుండడంతో రైతులు వాటిని తరలించి పంట పొలాలకు వేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాలలో ఉపాధి హామీ పనులు విరివిగా కొనసాగుతూ ఉండడంతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం బోధన్ మండలం సంగెం గ్రామంలో గల చెరువులో ఫీల్డ్ అసిస్టెంట్ గంగామణి చెరువు పూడికతీత పనులను చేయించారు.

ప్రతిరోజు వందల మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరవుతున్నారని, ప్రభుత్వం నిర్దేశించిన కొలతలకు అనుగుణంగా పనులు చేపడుతున్నామని ఫీల్డ్ అసిస్టెంట్ గంగామణి తెలిపారు.

వేధింపుల నుంచి కాపాడాలి

- ఆశా వర్కర్ ఫిర్యాదు

నవతెలంగాణ-బోధన్



ఆర్డీవో కార్యాలయంలో సిబ్బందికి ఫిర్యాదు అందిస్తున్న సునీత

సాలూరా మండల కేంద్రానికి చెందిన సునీత అనే ఆశావర్కర్ తనకు గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పించాలని కోరుతూ బోధన్ ఆర్డీఓ కార్యాలయంలో సిబ్బందికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోశెట్టి అనే వ్యక్తి తనను మానసికంగా తీవ్రంగా వేధిస్తున్నాడని అతని నుంచి తనకు ప్రాణహాని ఉందని అతని నుంచి తనను కాపాడాలని రక్షణ కల్పించాలని వేడుకోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాల క్రితం నాతో కలిసి ఉండి మోసం చేశాడని, తనకు రావలసిన డబ్బులు ఇవ్వడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తన కూతురికి, తనకు అతని వల్ల ప్రాణహాని ఉందని తెలిపారు. తనను వేధిస్తున్న ఈ వ్యక్తి ప్రస్తుతం మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వాపోయింది. గత సంవత్సరం సైతం ఆయన వేధింపులు భరించలేక కేసు పెట్టానని ఆయినా అతనిలో మార్పు రాలేదని తెలిపారు. కావున తనను ఆయన వేధింపుల నుంచి రక్షించి అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆశావర్కర్ సునీత పేర్కొన్నారు.

వీవోఏలతో సమీక్షా సమావేశం

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం వి.ఓ.ఎలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వీవోఏలు విధులు సక్రమంగా నిర్వహించాలని డి.పి.ఎంలు రవీందర్, సుధాకర్ సూచించారు. గ్రామాల్లోని అన్ని సంఘాలను ఏ గ్రేడ్‌లోకి తేవాలని తెలిపారు. పుస్తక నిర్వహణ సంక్రమంగా ఉండాలని సూచించారు. స్కూల్ యూనిఫామ్ కుట్టిన ప్రతి ఒక్కరికి రూ.50 చెల్లింపు చేస్తామని చెప్పారు. చేపల పెంపకం సభ్యుల ప్రతి గ్రామంలో గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో ఎ.పి.ఎం రాజిరెడ్డి, సి.సిలు అబ్బులింగం, అంజయ్య, రాములు, నరేందర్‌రెడ్డి, కృష్ణాంజలి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న వీవోఏలు